క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు



సీతారామచంద్రస్వామి ఆలయం

నేరేడుచర్ల : మండలంలోని మేడారం గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి పురాతన దేవాలయ పునర్నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేస్తూ దేవదాయ కమిషనర్ అనీల్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే సైదిరెడ్డి.. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో మాట్లాడి మేడారం ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఆలయానికి నిధులు మంజూరు కావడంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాయి మందిరానికి రూ.25 వేల విరాళం



నగదు అందజేస్తున్న కమలమ్మ

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి నడిగూడెంకు చెందిన కమలమ్మ తన భర్త బీరవల్లి రామిరెడ్డి జ్ఞాపకార్థం రూ.25 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు భోనగిరి ఉపేందర్, ఆలయ పూజారి రాజశేఖర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కోలాట ప్రదర్శన అద్భుతం



కోలాటంలో గెలుపొందిన చిన్నారులకు బహుమతి అందజేస్తున్న జెడ్పీటీసీ సైదిరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరంలో చిన్నగట్టు (లింగమంతులస్వామి) జాతర సందర్భంగా నిర్వహించిన కోలాటం పోటీల్లో చిన్నారుల ప్రదర్శన అద్భుతమని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. కోలాటం పోటీల్లో గెలుపొందిన బూరుగడ్డ గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ ఆసరా స్వచ్ఛంద సంస్థ నాట్యమండలి జూనియర్ కళాకారులకు బుధవారం రూ.10116 తృతీయ బహుమతి అందజేశారు. అనంతరం ఆ సంస్థ చైర్మన్ చిమట సైదులును సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అన్నెం శౌరిరెడ్డి, ఆలయ చైర్మన్ మట్టయ్య, నిర్వాహకులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

10న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈనెల 10వ తేదీన స్థానిక డీఈ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీఈ వెంకటకిష్టయ్య బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్, సభ్యులు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉన్న వారు సమావేశానికి హాజరై తమ సమస్యలను ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలన్నారు.

స్వామివారి ఊరేగింపు



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గట్టుపై ఉన్న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం అనంతరం బుధవారం పట్టణంలోని ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీతారామచంద్రస్వామిని పల్లకీలో, గోదాదేవి, వేణుగోపాలస్వామి వార్లను వివిధ వాహనాలపై అధిష్టింపజేసి పట్టణంలో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఈఓ, అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కోదాడరూరల్ : మండల పరిధిలోని రామలక్ష్మీపురం సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని బీరువాను పగులకొట్టి విలువైన వస్తువులు, కొంతమేర నగదును అపహరించుకుపోయినట్లు చైర్మన్ కొండపల్లి శేషగిరిరావు తెలిపారు. ఇదివరకు కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. త్వరలో ఆలయ కమిటీ సమావేశం నిర్వహించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సర్వీసు రోడ్ల నిర్వహణపై నిర్లక్ష్యం

- మునగాలలో అసంపూర్తిగా రోడ్డు
- డ్రెయినేజీ అస్తవ్యస్తంతో రహదారిపై పారుతున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మునగాల : మండల కేంద్రంలో సర్వీసు రోడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మునగాలలో ఫ్లైఓవర్ నిర్మించడంతో జీఎమ్మార్ సంస్థ రహదారికి ఇరువైపులా రెండు కి.మీ పొడవున సర్వీసు రోడ్డు నిర్మించాల్సి ఉంది. కానీ ఏళ్ల నుంచి మజీద్ వద్ద సుమారు 200 మీటర్ల మేర సర్వీసు రోడ్డు నిర్మించలేదు. దీంతో మండలంలోని నారాయణగూడెం, కృష్ణానగర్ గ్రామాల ప్రజలతో పాటు ఈ ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అయితే ఈ ప్రాంతంలో ఉన్న ఖబ్రస్తాన్ స్థలంలో నుంచి సర్వీసు రోడ్డు వెళ్లాల్సి వస్తుండడంతో ముస్లింలు సర్వీసు రోడ్డు నిర్మాణాన్ని వ్యతిరేకించారు. దీంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రజల ఆందోళనలతో దిగొచ్చిన ప్రభుత్వ అధికారులు ఎట్టకేలకు సర్వీసు రోడ్డు నిర్మాణానికి వక్ఫ్‌బోర్డు నుంచి అనుమతి పొందారు. ఇక వక్ఫ్‌బోర్డు అనుమతి తెలిపి ఏళ్లు గడుస్తున్నా సర్వీసు రోడ్డు చేపట్టలేదు. దీంతో ఆ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అదేవిధంగా సర్వీసు రోడ్లను ఆనుకొని ఉన్న డ్రెయినేజీలలో ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడంతో చెత్త చెదారంతో పూడిపోయి దుర్గంధం వెలుజల్లుతున్నాయి. మురుగు నీరు సర్వీసు రోడ్లపై పారుతోంది.



మునగాలలో మసీద్ వద్ద అసంపూర్తిగా సర్వీసు రోడ్డు



సర్వీసు రోడ్డుపై పారుతున్న మురుగునీరు

సబ్‌స్టేషన్ నుంచి అయ్యప్ప టెంపుల్ వరకు..

సూర్యాపేట నుంచి కోదాడ వైపు వెళ్లే మార్గంలో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ నుంచి అయ్యప్ప టెంపుల్ వరకు సుమారు రెండు కి.మీ మేర సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామప్రజలు కోరుతున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే భవిష్యత్‌లో ప్రమాదాలు పునరావృతం కావు. ఇటీవల జరిగిన ట్రాక్టర్ ప్రమాదం కేవలం సర్వీసు రోడ్డు లేకపోవడంతోనే జరిగిన విషయం విధితమే.

మరో దారి లేక హైవే పైకి..

ఇక ముకుందాపురంలో సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో గతిలేని పరిస్థితుల్లో గ్రామప్రజలు జాతీయ రహదారి పైకి రావల్సి వస్తోంది. ఫలితంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. సర్వీసు రోడ్ల నిర్మాణంతో పాటు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మూడేళ్ల క్రితం గ్రామస్తులు పార్టీలకతీతంగా పదిరోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా సర్వీసురోడ్డు నిర్మాణం చేపట్టి తమ ప్రాణాలు కాపాడాలని గ్రామ ప్రజలు అధికారులు, జీఎమ్మార్ సంస్థను కోరుతున్నారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలి



మండల కేంద్రంలో ఖబ్రస్తాన్ వద్ద నిలిచిపోయిన సర్వీసు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు, జీఎమ్మార్ సంస్థ దృష్టికి తీసుకెళ్లాం. సదరు సంస్థ స్పందించకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతాం.

– ఉప్పుల జానకిరెడ్డి, కాంగ్రెస్ మండల నాయకుడు

జీఎమ్మార్ సంస్థ నిర్లక్ష్యంతో..



జాతీయ రహదారికి ఇరువైపులా అసంపూర్తిగా ఉన్న సర్వీసు రోడ్లను సత్వరమే పూర్తిచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలి. జీఎమ్మార్ సంస్థ నిర్లక్ష్యంతో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు. భవిష్యత్‌లో ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలి.

– చింతకాయల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు, మునగాల

ప్రజాప్రతినిధులు స్పందించాలి



మాధవరం, మునగాలతో పాటు, ముకుందాపురం గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన సర్వీసురోడ్ల నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ స్పందించాలి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీఎమ్మార్ సంస్థపై వత్తిడి తీసుకొచ్చి సర్వీసు రోడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి.

– పందిరి నాగిరెడ్డి, విద్యావేత్త, ముకుందాపురం

66 ఫీట్ల విస్తరణతో వ్యాపారస్తులకు నష్టం

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డును ఇరువైపులా 30 ఫీట్ల మేర 60 ఫిట్లు విస్తరింపజేస్తే సరిపోతుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. బుధవారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అఖిలపక్ష సమావేశం నిర్వహించకుండా వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఒక్కరిద్దరు నాయకుల నిర్ణయంతో రోడ్డును 66 ఫీట్ల మేర విస్తరించడంతో వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. మున్సిపాలిటీకి రింగ్ రోడ్డులా బైపాస్ ఉన్నందున వాటిని వెడల్పు చేసి అభివృద్ధి చేస్తే పట్టణంలోని ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఉదర వెంకన్న, ఉపేందర్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో నిధులు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న అంజిరెడ్డి

పాలకవీడు : మండలంలోని మూసీఒడ్డుసింగారం, అలింగాపురం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.30 లక్షలు, ఎస్‌డీఎఫ్ నుంచి మంజూరైన రూ.20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలను బుధవారం సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కె.అంజిరెడ్డి.. సర్పంచ్‌లు వెంకటరమణ, కొత్త లక్ష్మమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సైదిరెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యడ్ల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, రావుల కోటయ్య నాయకులు పసుపులేటి సైదులు, తీగల వెంకట్‌రెడ్డి, మల్లేపల్లి కోటయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి

మునగాల : వ్యవసాయ కూలీల వలసలను నివారించేందుకు వేసవి సీజన్ ఆరంభమైనందున గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు కోరారు. బుధవారం మండలంలోని ఆకుపాముల, నర్సింహాపురం గ్రామాల్లో ఆయన వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.600లకు పెంచాలన్నారు. ఉపాధి హామీ చట్టం అమలులో అనేక లోపాలు ఉన్నాయన్నారు. మోదీ సర్కార్ ఉపాధి హామీకి ఉరివేసేందుకు చూస్తుందని, అందుకే బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సొంపంగు జానయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ఆరె.రామకృష్ణారెడ్డి, నాయకులు తోకల లక్ష్మయ్య, గుండు కరుణాకర్, వ్యవసాయ కూలీలు వెంకటమ్మ, కేశగాని జానమ్మ, లక్ష్మయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



దాత అందజేసిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని రిటైర్డ్ ఎంఈఓ దేవదానం అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మాజీ ఎంఈఓ దివంగత పానుగోతు లక్‌పతినాయక్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గోపీనాథ్ రూ.20 వేల విలువైన స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉదయశ్రీ, ఉపాధ్యాయులు టి.శ్రీనివాస్, ఎల్.శ్రీనివాసరెడ్డి, ఎం.ప్రభాకర్‌రావు, వై. ఉపేందర్, వసంతరావు, శేషగిరి, అన్వేష్, వెంకటేశ్వర్లు, రవీందర్ రెడ్డి, అరుణ రాణి, అశోక్‌కుమార్, జానీబేగం, మున్ని, శేఖర్, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



రత్నవరం ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న మరుగు దొడ్ల నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీఓ యం.యర్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ ఎర్రా లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, సీఆర్పీ నందిగామ రామారావు, పగడాల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సత్యనారాయణ ఆశయాలు సాధించాలి

కోదాడరూరల్ : తమ్మినేని సత్యనారాయణ ఆశయాలను సాధించాలని సీపీఐ మండల కారదర్శి బత్తినేని హనుమంతరావు అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని తమ్మరలో సత్యనారాయణ 18వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడి నిత్యం పేదల పక్షాన నిలిచిన గొప్ప నాయకుడు సత్యనారాయణ అని అన్నారు. కార్యక్రమంలో తమ్మినేని సరోజనమ్మ, రమేష్, కోటి నారాయణ, కమతం పుల్లయ్య, కుటుంబరావు, రామకృష్ణ, రమేష్, శ్రీను, గోవిందరావు ఉన్నారు.



సత్యనారాయణ స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

యూత్ కాంగ్రెస్ నాయకుడి సస్పెన్షన్




మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి

అనంతగిరి : కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన యూత్ కాంగ్రెస్ నాయకుడు గరిడేపల్లి సైదులుని సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చనుపల్లి గ్రామానికి చెందిన గరిడేపల్లి సైదులు కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ నాయకుడిగా, ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా పదవులు అనుభవిస్తూ గత మూడు నెలలుగా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక కార్యాకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపించారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి, ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్ష పదవుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీకి నష్టం కలిగించే వారికి ఇలానే సమాధానం చెప్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షుడు కొండపల్లి వాసు, డేగ కొండయ్య, మట్టపల్లి రామకోటయ్య పాల్గొన్నారు.

విద్యుత్ కోతతో ఎండిపోతున్న వరి పొలాలు

మోతె : వ్యవసాయానికి విద్యుత్ సరిపడా సరఫరా కాకపోవడంతో వరి పొలాలు ఎండిపోతున్నాయని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కాకి మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోతె మండలంలో గత 5 రోజుల నుంచి త్రిఫేజ్ విద్యుత్ సకాలంలో అందకపోవడంతో పొలాలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. విద్యుత్ లైన్‌మెన్‌కు, ఏఈకి రైతులు ఫోన్ చేసినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి త్రిఫేజ్ విద్యుత్‌ను తక్షణమే అందజేయాలన్నారు. ఆయనవెంట కోట మధుసుదన్‌రెడ్డి, మల్లయ్య, వెంకన్న రైతులు ఉన్నారు.

దూడలకు బ్రూసెల్లా టీకాలు



దూడకు టీకా వేస్తున్న డాక్టర్ నాగేంద్ర

గరిడేపల్లి : మండలంలోని గానుగుబండలో 4 నుంచి 8 నెలల వయస్సు గల ఆడ దూడలకు బుధవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ నాగేంద్ర మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దూడలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శేఖర్, గోపి, స్థానికులు ఉన్నారు.

లారీ, బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

చివ్వెంల (సూర్యాపేట) : లారీ అదుపు తప్పి ఎదురుగా వెళ్తున్న బైక్‌ను ఢీ కొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని కుడకుడ గ్రామశివారులో సూర్యాపేట–దంతాలపల్లి రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమ్మికల్ నుంచి సూర్యాపేట వెళ్తున్న బైక్‌ను లారీ వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. స్థానికులు లారీని అడ్డగించి పోలీసులకు అప్పగించారు. బాధితుడి వివరాలు తెలియాల్సి ఉంది.

హాథ్ సే హాథ్ యాత్రను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ అజీజ్ పాషా

హుజూర్‌నగర్ : ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ అజీజ్ పాషా, మాజీ జెడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, పట్టణ ఉపాధ్యక్షుడు జక్కుల మల్లయ్య కోరారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ యాత్రతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సందేశాన్ని గడపగడపకు తీసుకువెళ్లాలని కోరారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు వివరిస్తూ ఈ పాదయాత్రను కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.రామరాజు, సుదర్శన్, బెంజిమెన్, అజ్మతుల్లా, రాము, మట్టయ్య, ముత్తయ్య, పుల్లయ్య, సుబ్బరాజు, జగన్, సైదులు, పున్నయ్య, సోమయ్య, రాజు, రాము, సత్యనారాయణ, మధు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యార్థులు, యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. మండలంలోని అమరవరంలో చిన్నగట్టు (లింగమంతులస్వామి) జాతర సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఆయన బుధవారం రాత్రి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జుల సుజాత, కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

సీతారామచంద్రస్వామి ఆలయ పనుల పరిశీలన



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

అనంతగిరి : మండల పరిధిలోని బొజ్జగూడెం తండాలో నిర్మిస్తున్న శ్రీకోదండ సీతారామచంద్రస్వామి ఆయల నిర్మాణ పనులను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ, గ్రామ ప్రజలతో ఆలయ నిర్మాణం గురించి చర్చించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పద్మావతిరెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణోతు వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ ధారావత్ రామ, రేవూరి వెంకటాచారి, సైదులు, బాబునాయక్, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

మునగాల : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.శైలజ కోరారు. బుధవారం మండలంలోని ముకుందాపురంలో కంటి వెలుగు శిబిరంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా చిలుకూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిను పుట్టు అంధుడు గుండపునేని సీతయ్య చేత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పనస నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రవి, వైద్య సిబ్బంది యామిని, శారద, సందీప్, ఆశవర్కర్లు, గ్రామపెద్దలు పందిరి నాగిరెడ్డి, నూకమళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం

హుజూర్‌నగర్‌రూరల్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని అంజలిపురంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ కొప్పుల రామనర్సమ్మతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, ఉప సర్పంచ్ కుందురు విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి నరేష్, సూర్యనారాయణ, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 3వ వార్డు కౌన్సిలర్ సామినేని నరేష్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని తమ్మరలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బత్తినేని హనుమంతరావు, వైద్య సిబ్బంది ఉన్నారు.



హుజూర్‌నగర్‌రూరల్ : కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్



మునగాల : ముకుందాపురంలో కంటివైద్య పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

ఫ్లెక్సీలు చింపిన దుండగులపై ఫిర్యాదు



కాపుగల్లు క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపిన దుండగులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాసాని రామారావు బుధవారం రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, స్థానిక నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే దుండగులు ఉద్దేశపూర్వకంగా చింపారని తెలిపారు. గతంలో కూడా సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, ముత్తవరపు వీరయ్య, రాధాకృష్ణ ఉన్నారు.

వేప నూనె, వేప పిండితో రైతులకు మేలు

గరిడేపల్లి : వేప నూనె, వేప పిండితో రైతులకు మేలు జరుగుతుందని లయోలా కళాశాల విద్యార్థినులు అన్నారు. బుధవారం గరిడేపల్లిలో రైతులకు వేప నూనె, వేప పిండి వలన కలిగే ప్రయోజనాలను అవగాహన కల్పించారు. వేప పిండి, వేప నూనెతో చీడపీడల నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. వేప నూనె, పిండిని నేరుగా కాని, యూరియా, పురుగు మందుల్లో కలిపి వినయోగించాలన్నారు. 50 కిలోల యూరియాకు ఆర లీటరు వేప నూనె కలుపుకోవడం ద్వారా నత్రజని త్వరగా కరిగిపోకుండా మొక్కకు ఎక్కువ సమయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త లవకుమార్, విద్యార్థులు అల్లాడ మానస, కొప్పుల జ్ఞానసిరి, శ్రీనిధి, ఆకర్ష రెడ్డి, హారిక, అఖిల, సింధుప్రియ, రైతులు జానకి రామ్‌రెడ్డి, బండ వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

● కమ్మేసిన మంచు దుప్పటి



రహదారిని కప్పేసిన మంచు



వరి పొలంపై ముత్యాల హారాలను తలపిస్తున్న మంచు బిందువులు

హుజూర్‌నగర్ పరిసర ప్రాంతాన్ని బుధవారం ఉదయం మంచు దుప్పటి కమ్మేసింది. పొద్దెక్కినా మంచు తెరలు తొలగిపోలేదు. రెండు మూడు రోజులుగా ఇదే పరిస్థితి. పొగ మంచులోనే ప్రయాణికులు వాహనాల లైట్ల వెలుతురులో ప్రయాణం కొనసాగించారు. దినసరి కూలీలు పనులకు వెళ్లారు. కాగా పలు ప్రాంతాల్లో వరి పొలాలపై కురిసిన పొగ మంచు బిందువులపై సూర్యకాంతి పడి ముత్యాల హారాలను తలపించాయి. – హుజూర్‌నగర్